

అరచేతిలో డిజిటల్ లైబ్రరీ

డిజిటలీకరణ పెరగడంతో అన్నిరకాల సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటున్నాయి. డిజిటల్ లైబ్రరీ కూడా అందుబాటులోకి వచ్చింది.

8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ గురు : 6:32

సహర్ శుక్ర: 4:45

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.4 /27.7

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. కొంతమేర మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కనకాపూర్‌లో పోలీసుల కవాతు



కవాతులో పాల్గొన్న సీఐ నవీన్‌కుమార్

లక్ష్మణచాంద/మామడ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో లక్ష్మణచాంద మండలం కనకాపూర్, మామడ మండలం పరిమండల్‌లో పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. సోన్ సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ పోలీసులు కవాతు చేశారు. సీఐ నవీన్‌కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు, స్వేచ్ఛగా ఓటహక్కు వినియోగించుకునేందుకు కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అందరూ ప్రలోభాలకు లొంగకుండా సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందులో ఎస్సైలు శ్రీకాంత్, ఎస్సై సందీప్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ స్పాట్

నిర్మల్ రూరల్: పదో తరగతి జవాబు పత్రాల స్పాట్ వాల్యుయేషన్ జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లాకు వివిధ జిల్లాల నుంచి జవాబు పత్రాలు చేరుకుంటున్నాయి. సుమారు 1.40 లక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాల్యుయేషన్ ఉంటుంది. దీనికోసం సుమారు 575 మంది సిబ్బందిని నియమించారు. కేంద్రంలో ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్ల వినియోగం నిషేధమని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

జీఎంసీ నిర్మల్‌లో వైద్యుల పోస్టుల భర్తీ

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మల్ నందు ఖాళీగా ఉన్న 44 వైద్యాధికారులు, 19 సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీడీఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రభుత్వం మెడికల్ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. 44 వైద్యాధికారులలో 11 ప్రొఫెసర్స్, 20 అసోసియేట్ ప్రొఫెసర్స్, 13 అసిస్టెంట్ ప్రొఫెసర్స్ పోస్టులు కాంట్రాక్ట్ పద్ధతిన, 19 సీనియర్ రెసిడెంట్స్ పోస్టులు హనరోరియం పద్ధతిన భర్తీ చేయనున్నట్లు వివరించారు.


ఆసుపత్రి తనిఖీ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

భైంసా: బాసరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ధనరాజ్ మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని తెలిపారు. ఎండలో పిల్లలు, వృద్ధులు బయటకు రావొద్దని పేర్కొన్నారు. రైతులు, కూలీలు ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న సమయంలో పనులు చేయవద్దని సూచించారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి



పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

ముథోల్: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులకు సూచించారు. మండలంలోని రువ్వి, ఆష్ట గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. మిషన్‌భగీరథ నీటి పైపులు ఇటీవల పగిలిపోవడంతో అధికారులు మరమ్మతు చేపట్టారు. పైపులైన్ల లీకేజీలపై ఆయా గ్రామాల సెక్రటరీలకు పలు సూచనలు చేశారు. వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట సిబ్బంది, ఆయా గ్రామాల సెక్రెటరీలు ఉన్నారు.

‘రుణం’ తీర్చుకున్నారు..



జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేసి విజయ సంకేతం చూపుతున్న అధికారులు, సిబ్బంది

- స్త్రీనిధి, బ్యాంకు రుణాలతో.. గ్రామీణ మహిళల స్వయం ఉపాధి
- రుణాల చెల్లింపులోనూ ముందంజ
- రికవరీలో రాష్ట్రంలోనే జిల్లా ఫస్ట్

నిర్మల్: నిర్మల్ అంటేనే మహిళల ఖిల్లా. ఇక్కడ రాష్ట్రంలోనే పురుషుల కంటే మహిళల జనాభా ఎక్కువ. కాసింత తోడుగా నిలిస్తే.. వారు ఏదైనా సాధిస్తామంటున్నారు. ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యం, జిల్లా అధికారుల ప్రోత్సాహం, క్షేత్రస్థాయి సిబ్బంది సహకారంతో.. జిల్లా మహిళలు తమ కాళ్లపై తాము నిలుస్తున్నారు. తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తూ మరోమారు జిల్లాను రాష్ట్రంలోనే ముందంజలో నిలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల రికవరీలో జిల్లా రాష్ట్రంలోనే టాప్‌లో నిలిచింది. మొండిబకాయిలనూ వసూలు చేయడంలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సఫలీకృతులయ్యారు. రాష్ట్రంలోనే ముందంజలో ఉండటంపై కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ సైతం హర్షం వ్యక్తం చేశారు. డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది మంగళవారం కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

లక్ష్యానికి మించి రుణాలు..

ఆర్థిక సంవత్సరం(2023–24)లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలు అందించారు. మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని మొత్తం 8,465 స్వయం సహాయక సంఘాలకు రూ.403.82 కోట్ల రుణలక్ష్యం ఉండగా, మొత్తం 7,754 సంఘాలకు రూ.448.85 కోట్ల రుణాలు అందించారు. లక్ష్యాన్ని దాటి ఏకంగా 111.15శాతం సాధించారు.

రికవరీలోనూ టాప్..

బ్యాంకు లింకేజీ రుణాల చెల్లింపుల్లో రికార్డుస్థాయిలో అందించిన జిల్లా అధికారులు రికవరీలో ఏకంగా రాష్ట్రంలోనే ముందంజలో నిలిచారు. జిల్లాలో రుణాలు తిరిగి చెల్లించడంలో మొండిబకాయిలు(ఎన్‌పీఏ) ఎంత తక్కువ శాతం ఉంటే.. ఆ జిల్లా అంత ఎక్కువగా రికవరీ చేసినట్లు లెక్క. దీని ప్రకారం జిల్లాలో మొండిబకాయిల శాతం సోమవారం నాటికి కేవలం 0.18 మాత్రమే. దీంతో రికవరీలో రాష్ట్రంలోనే జిల్లా టాప్‌లో ఉంది.

హర్షం వ్యక్తం చేసిన అధికారులు..

ఆర్థిక సంవత్సరం(2023–24)లో బ్యాంకు లింకేజీ రుణాల రికవరీలో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలవడం, అలాగే స్త్రీనిధి ద్వారా 102 శాతం రుణాలు అందించడంపై జిల్లా ఉన్నతాధికారులు హర్షం వ్యక్తంచేశారు. డీఆర్డీవో విజయలక్ష్మి, స్త్రీనిధి, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ అభినందించారు. స్థానిక కొండాపూర్‌లోని సమీకృత వ్యవసాయక్షేత్రంలో సంబంధిత అధికారులు, సిబ్బంది డీఆర్వీవోను మంగళవారం సన్మానించారు.

స్త్రీనిధితోనూ స్వయంసమృద్ధి..

జిల్లాలో స్త్రీనిధితోనూ మహిళలు స్వయంసమృద్ధి సాధిస్తున్నారు. రుణాల లక్ష్యాన్ని దాటేస్తూ.. స్వయం ఉపాధి పొందుతున్నారు. తాజాగా ముగిసిన 2023–24 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి ద్వారా లక్ష్యాన్ని మించి రుణాలు అందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.98 కోట్ల రుణలక్ష్యం కాగా, ఏకంగా రూ.103.51 కోట్ల రుణాలు అందించారు. జిల్లాలో మొత్తం 375 గ్రామైక్య సంఘాల్లోని 3,619 సంఘాలలో 11,045 మంది మహిళలకు స్త్రీనిధి ద్వారా ఆర్థికసాయం అందించారు. ఇందులో 90 శాతం రికవరీ సాధించడం గమనార్హం.

మహిళల ఆర్థికాభివృద్ధికి..



జిల్లాలో మహిళలు స్వయం ఉపాధి పొందడంతోపాటు ఆర్థికాభివృద్ధి సాధించేలా స్త్రీనిధి రుణాలను అందిస్తున్నాం. చాలామంది మహిళలు ఇప్పటికే తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారు.

–సరిత, స్త్రీనిధి ఆర్ఎం

అందరి సహకారంతో..



ఉపాధిహామీతోపాటు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీలో జిల్లా ముందంజలో ఉంటోంది. ఈసారి కూడా రుణాల అందజేత, రికవరీలో ముందువరుసలో నిలిచాం. సంబంధిత అధికారులతోపాటు క్షేత్రస్థాయి సిబ్బంది సహకారం ఉంది.

– విజయలక్ష్మి, డీఆర్డీవో

హర్షనీయం..



గ్రామీణ మహిళల స్వయం ఉపాధి కోసం రుణాల అందజేత, తిరిగి రుణాల చెల్లింపుల్లో జిల్లా ముందంజలో ఉండటం హర్షనీయం. ముమ్ముందు కూడా ఇలాగే మహిళల స్వయంసమృద్ధికి పాటుపడాలి.

–ఆశిష్ సంగ్వాన్, కలెక్టర్

ఆస్తిపన్ను చెల్లింపునకు ఎర్లీబర్డ్

- ముందస్తు చెల్లింపుపై 5 శాతం రాయితీ

భైంసాటౌన్: బల్దియాల్లో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు పురపాలక శాఖ మరో అవకాశం కల్పించింది. 2024–25 ఆర్థిక సంవత్సరం పన్ను ముందస్తుగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. ఏటా సకాలంలో ఆస్తి పన్ను చెల్లిస్తున్న వారికి పురపాలక శాఖ నూతన ఆర్థిక సంవత్సర ప్రారంభంలో ముందస్తు చెల్లింపులపై ఎర్లీబర్డ్ కింద రాయితీ అవకాశం కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది సైతం ఏప్రిల్ 30 లోగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి రాయితీ వర్తించనుంది.

ఆస్తిపన్ను వసూలు కోసం..

పురపాలికలకు ఆస్తిపన్ను కూడా ప్రధాన ఆదాయ వనరు. సకాలంలో పన్నులు చెల్లిస్తే సౌకర్యాల కల్పన, అభివృద్ధికి ఆటంకాలు ఉండవు. ఈ నేపథ్యంలో ఆస్తి పన్ను వసూలు కోసం పురపాలక శాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే పన్ను చెల్లింపుదారులకు రాయితీ అవకాశం కల్పిస్తోంది. గత బకాయిల వసూలు కోసం ఓటీఎస్ (వన్ టైం సెటిల్ మెంట్) కింద వడ్డీపై 90 శాతం రాయితీ ఇచ్చింది. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీల్లో చాలామంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ప్రస్తుతం నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఏడాది పన్ను ముందస్తుగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ అందిస్తోంది.

మున్సిపల్	డిమాండ్(రూ.కోట్లలో)
నిర్మల్	రూ.10.93
భైంసా	రూ.6.02
ఖానాపూర్	రూ.1.19

వారికే అవకాశం...

2023–24 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తి పన్ను బకాయిలు పూర్తిగా చెల్లించిన వారికి మాత్రమే ఎర్లీబర్డ్ కింద రాయితీ వర్తిస్తుంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెలాఖరులోగా చెల్లించిన వారికి రాయితీ ప్రయోజనం చేకూరనుంది.

సద్వినియోగం చేసుకోవాలి..

ఎర్లీబర్డ్ కింద 2024–25 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను ముందుగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ అవకాశం కల్పించింది. ఏప్రిల్ 30లోగా చెల్లించిన వారికి మాత్రమే ఈ అవకాశం వర్తిస్తుంది. పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్, భైంసా

‘సిరాల’ను సందర్శించిన అదనపు కలెక్టర్

- ప్రాజెక్టు త్వరగా నిర్మించాలని కోరిన ఆయకట్టు రైతులు
- భూగర్భజలాలు పడిపోతున్నాయని ఆందోళన



సిరాల ప్రాజెక్టు వద్ద రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్

భైంసారూరల్: గత జూలైలో కురిసిన భారీ వర్షాలకు తెగిపోయిన సిరాల ప్రాజెక్టును అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ మంగళవారం పరిశీలించారు. ప్రాజెక్టు పరిసరాలను సందర్శించారు. రైతులతో కలిసి మాట్లాడారు. భారీ వర్షాలతో ప్రాజెక్టు తెగడంతో రెండు పంటలు నష్టపోయామని రైతులు తెలిపారు. వనాకాలం నాటికి ప్రాజెక్టు నిర్మించకుంటే వచ్చే ఏడాది కూడా పంటలు పండవని పేర్కొన్నారు. వర్షాలు కురవక ముందే ప్రధాన కట్ట పనులు పూర్తి చేయించాలని కోరారు. కట్ట నిర్మించకుంటే మహారాష్ట్రవైపు నుంచి వచ్చే వరద నీరంతా తెగిపోయిన ప్రాంతం నుంచి నేరుగా పొలాల మీదుగా ప్రవహిస్తుందని తెలిపారు. 140 ఏళ్ల ఈ ప్రాజెక్టు మొదటిసారి తెగిందని చెప్పారు. ప్రాజెక్టు తెగిపోవడంతో ఉమ్రి, బోల్సా, బోసి, మాంజ్రి, ఇలేగాం గ్రామాల్లోని బోర్లు, బావులు ఎండిపోయాయని తెలిపారు. ఫైజాన్‌అహ్మద్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టు పునర్నిర్మాణంపై కలెక్టర్‌కు నివేదిస్తానని చెప్పారు.

నర్సరీ, డంపింగ్ యార్డుల పరిశీలన...

అనంతరం అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ నర్సరీ, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. నర్సరీలో మొక్కలు పెంచి వర్షాకాలం నాటికి సంరక్షించాలన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా డంపింగ్‌యార్డులో నిల్వ చేయాలన్నారు. పంచాయతీ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. రోడ్లు శుభ్రంగా ఉంచాలని, డ్రైనేజీల నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆయన వెంట డీపీవో శ్రీనివాస్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీవో మోజంహుస్సేన్, రైతులు ఉన్నారు.

ప్ర‘జల’పాట్లు తీరేలా..

- ‘సాక్షి’ కథనానికి కలెక్టర్ స్పందన
- తాగునీటి సమస్య తీర్చాలని ఆదేశం
- తక్షణమే చర్యలు చేపట్టిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నిర్మల్: తాగునీటికి తిప్పలు పడుతున్న గ్రామీణుల గోసను తీర్చేందుకు అధికారులు ముందుకు వచ్చారు. గుక్కెడు నీటి కోసం ప్రజలు పడుతున్న కష్టాలపై ‘సాక్షి’ సోమవారం ‘గ్రౌండ్ రిపోర్ట్’ చేసింది. ఈ సమస్యలు అధికారుల దృష్టికి వెళ్లేలా ప్ర‘జల’పాట్లు.. శీర్షికన మంగళవారం కథనాన్ని ప్రచురించింది. దీనిపై కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ స్పందించారు. ఆయా గ్రామాలతోపాటు జిల్లావ్యాప్తంగా ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలంటూ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు మండల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి చెప్పడంతో మంగళవారం మధ్యాహ్నం నుంచే గ్రామాల్లో పనులు, మరమ్మతులు చేపట్టారు. దీంతో సాయంత్రానికి ఆ గ్రామాల ప్రజలకు తాగునీళ్లు అందుబాటులోకి వచ్చాయి. ముధోల్ మండలం చింతకుంట తండాలో డీఈఈ లక్ష్మీనారాయణ, ఆదిత్య, ఎంపీవో ఆమీర్‌ఖాన్, కార్యదర్శి అన్వర్ తదితరులు దగ్గరుండి నల్లాలు ఏర్పాటు చేయించారు. తానూరు మండలం బెంబర ఆబాదిలో పరిశీలించిన ఎంపీడీవో మోహన్‌సింగ్, రెండురోజుల్లో బోరుమోటారు ఏర్పాటు చేస్తామన్నారు.



చింతకుంటతండాలో ఏర్పాటు చేసిన నల్లాలు

సంతోషంగా ఉంది..



మాగ్రామంలో తాగునీటి కోసం పొలాల్లోని బోర్ల దగ్గరికి పోతున్నం. ఈ తిప్పలపై ‘సాక్షి’ కథనం రాయడం, వెంటనే కలెక్టర్ ఆదేశాలివ్వడంతో మాకష్టం తీరింది. సార్లు వచ్చి ఊళ్లోనే నల్లాలు ఏర్పాటు చేసిండ్రు.

– తులసీబాయి, చింతకుంటతండా

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

- డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ తప్పక వినియోగించుకోవాలని డీఈవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మంగళవారం నిర్వహించిన ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం నంబర్– 12ను శిక్షణ కేంద్రంలోని ప్రత్యేక కౌంటర్లో అందించాలన్నారు. ఫారం నంబర్–12తోపాటు, ఎపిక్ కార్డు జిరాక్స్, ఎన్నికల ఆర్డర్ కాపీని జతచేసి శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లో ఇవ్వాలని సూచించారు. దరఖాస్తును శిక్షణ రోజు సమర్పించలేకపోయిన వారు తమ పాఠశాల సమయం ముగిసిన తర్వాత అందించవచ్చని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతీ ఉద్యోగి తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గురు, శుక్రవారాల్లో జరిగే శిక్షణ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలకు బదులుగా, ఈద్‌గాంలో ఉన్న వశిష్ఠ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణకు ఎంపిక చేసిన ఉద్యోగులంతా హాజరు కావాలని సూచించారు. హాజరు కానివారికి ఎన్నికల నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చి, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిప్పుతో జాగ్రత్త!

- జిల్లాలో మండుతున్న ఎండలు
- అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం
- ఈ ఏడాది ఇప్పటికే 132 అగ్ని ప్రమాదాలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అగ్నిమాపక సిబ్బంది



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

నిర్మల్‌టౌన్: వంట గది.. పంట చేలు.. షాపింగ్ మాల్స్.. ఆసుపత్రులు.. విద్యాసంస్థలు.. ఆఫీసులు.. పెట్రోల్ బంకులు.. స్థలమేదైనా సరే అప్రమత్తంగా ఉండాల్సిందే.. ఎందుకంటే వేసవికాలం వచ్చింది. సహజంగా వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. ప్రధానంగా గ్రామాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయ పనులు ముగియడంతో పంట చేనులో ఎండిన గడ్డి, పంట వ్యర్థాలను కాలుస్తుంటారు. ఈ సమయంలో జాగ్రత్తగా ఉండకపోతే గాలికి నిప్పురవ్వలు ఎగిరి సమీపంలో ఉన్న గడ్డివాములు లేదా ఇళ్లపై పడితే మంటలు వ్యాప్తి చెందుతాయి. పట్టణ ప్రాంతాల్లో అయితే ఎక్కువగా విద్యుత్ సంబంధిత అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రధానంగా ఎండ తీవ్రతను తట్టుకునేందుకు షాపింగ్ మాల్స్, ఆసుపత్రులు, ఇతర వ్యాపార సముదాయాలతోపాటు నివాసాల్లో ఏసీలను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఈక్రమంలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ ఉపకరణాలు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. అగ్ని ప్రమాదం ఎలా జరిగినా ఆస్తి, ప్రాణ నష్టం.. వాటిల్లుతుంది. అందుకే వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారులు సూచిస్తున్నారు.

స్కూల్స్, షాపింగ్ మాల్స్, ఆస్పత్రుల్లో..

సూల్స్, షాపింగ్ మాల్స్, ఆసుపత్రుల పైకప్పులు ఆర్సీసీ లేదా కాంక్రీట్ స్లాబులు మాత్రమే ఉండాలి. ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి. సెల్లార్లలో ఆటోమేటిక్ స్ప్రింక్లర్స్‌ను ఉపయోగించాలి. స్కూళ్లు, హాస్పిటల్స్‌లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తప్పించుకునేందుకు సరైన ప్రణాళికను రచించి అందరికీ తెలిసే విధంగా అవగాహన కల్పించాలి. షాపింగ్ మాల్స్‌లో ఎలక్ట్రికల్ సామగ్రిని ఐఎస్ఐ మార్క్ కలిగిన వాటిని మాత్రమే వాడాలి. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కి సమాచారం అందించాలి. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు అగ్నిప్రమాదం సంభవించకుండా మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్స్‌ను అమర్చుకోవాలి. అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉన్న ప్రదేశాలను ముందుగా గుర్తించి ప్రమాదం జరగకుండా చూడాలి.

వంటగదిలో..

వంటింటి కింది పైభాగాల్లో గాలి, వెలుతురు ఉండేలా చూడాలి. చెడిపోయిన గ్యాస్ ట్యూబ్‌లు వాడొద్దు. ఐఎస్ఐ మార్కు ఉన్న కొత్త ట్యూబ్లను వెంటనే మార్చుకోవాలి. ఎల్పీజీ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి. గ్యాస్ లీక్ అవుతున్నట్లు అనుమానం వస్తే రెగ్యులేటర్ తీసివేయాలి. మండుతున్న స్టవ్‌లో కిరోసిన్ పోయవద్దు. కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి వంటగదిలో ఉంచరాదు.

గ్రామీణ ప్రాంతాల్లో..

పూర్తిగా ఎండిన గడ్డిని మాత్రమే వాముగా వేయాలి. గడ్డివాములు నివాస ప్రాంతాలకు దూరంగా ఉండేలా చూసుకోవాలి. గడ్డివాముల మధ్యలో దూరం ఎక్కువగా ఉండాలి.

గోదాములు – గిడ్డంగుల్లో..

గోదాములు గిడ్డంగుల్లో స్టాక్‌ను చెక్క స్లీపర్లపై మాత్రమే నిల్వ చేయాలి. నిల్వల మధ్యలో గ్యాంగ్వే, క్రాస్ సెక్షన్లను ఉంచాలి. వస్తువుల నిల్వలు మీటర్ల ఎత్తుకంటే ఎక్కువ నిల్వ చేయరాదు. ట్రక్కుల ఇంజిన్లను ఆఫ్‌చేసి వస్తువులను లోడ్ చేయాలి. కర్మాగారాల పరిసరాల్లో చెత్తా చెదారం ఉంచకూడదు. ఉద్యోగులందరికీ ఫైర్ ఫైటింగ్‌లో శిక్షణ ఇవ్వాలి. అగ్ని ప్రమాదాలు జరిగే ప్రదేశాలు గుర్తించాలి. మిషనరీ బెల్టులు, విద్యుత్ పరికరాల నుంచి నిప్పురవ్వలు రాలకుండా జాగ్రత్త వహించాలి.

నివారణ పద్ధతులు..

ఇంట్లో వస్తువులను అల్మారాల్లో, సెల్ఫ్ సక్రమంగా సర్దుకొని.. ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, పటాకులు, ఇతర మండే వస్తువులు, పేలుడు పదార్థాలు ఏవీ అందుబాటులో ఉంచరాదు. కాల్చిన సిగరెట్లు, బీడీలు, చుట్టలు, అగ్గిపుల్లలు ఆర్పకుండా బయటకు పారవేయరాదు. ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైరింగ్ పరికరాలనే ఉపయోగించాలి. పాడైన వైర్లను వాడొద్దు. ఓవర్ లోడ్ చేయవద్దు. ఎలక్ట్రికల్ సాకెట్‌లో కెపాసిటీకి తగిన ప్లగ్‌ను మాత్రమే వాడాలి. ఇంటి నుంచి ఎక్కువ రోజులు సెలవులకు బయటికి వెళ్లినప్పుడు ఎలక్ట్రికల్ మెయిన్ ఆఫ్ చేయాలి. అగ్ని ప్రమాదం జరిగితే ఆర్పడానికి నీటిని ఇంట్లో నిల్వ ఉంచాలి.

జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత

జిల్లాలో రోజురోజుకు ఎండలు మండుతున్నాయి. గరిష్ఠంగా 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే రెండు నెలలు ఎలా ఉంటాయో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండుతున్న ఎండలకు అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని అగ్నిమాపక శాఖ అధికారులు చెప్తున్నారు.

132 అగ్ని ప్రమాద కేసులు..

జిల్లా కేంద్రంలో గతేడాది మార్చి నుంచి ఇప్పటి వరకు 132 అగ్ని ప్రమాద కేసులు నమోదయ్యాయి. ఇందులో నిర్మల్‌లో 61 అగ్ని ప్రమాదాలు, భైంసాలో 53, ఖానాపూర్లో 18 కేసులు నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో రూ.1.58 కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో స్పందించి మంటలార్పడంతో దాదాపు రూ.6.55 కోట్ల ఆస్తి బూడిదవకుండా కాపాడారు.

వెంటనే సమాచారమివ్వాలి

జిల్లా వ్యాప్తంగా అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే ఫైర్ 101, 100 టోల్ ఫ్రీ నంబర్లు, ఇతర ఫైర్ స్టేషన్ల అధికారులకు సమాచారం అందించాలి. గత ఏడాది కన్నా ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలి. షాపింగ్ మాల్స్, ఆస్పత్రి , ఫ్యాక్టరీలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలో నిర్మల్, భైంసా, ఖానాపూర్‌లో ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటాం.

– కేశవులు, ఉమ్మడి జిల్లా అగ్నిమాపక అధికారి

క్లుప్తంగా

సంస్మరణ వేడుకలు అధికారికంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): జల్ జంగల్ జమీన్ నినాదంతో పోరాడి పోలీసుల కాల్పుల్లో అసువులు బాసిన అమరుల స్మారకార్థం ఏప్రిల్ 20న సంస్మరణ వేడుకలు ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని అమర వీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ భారతదేశంలో రెండో జలియన్‌వాలా బాగ్‌గా కొనియాడే ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు సోయం రాందాస్, మండల అధ్యక్షుడు జుగ్నాక్ భరత్, నాయకులు గేడం భరత్, పృథ్వీరాజ్, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మేకలు అందజేత

ఆదిలాబాద్‌రూరల్: గతేడాది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లోకారి గ్రామానికి చెందిన రైతు సంతోషం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.22వేల విలువ చేసే మేకలను అందజేశారు. ఈ సందర్భంగా రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కిసాన్ బంధు రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌ను కోరగా అమెరికాలో నివాసం ఉంటున్న దీప్తి మనోహర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారన్నారు. స్పందించి బాధిత కుటుంబానికి రూ.22 వేలు అందించగా మేకలు కొనుగోలు అప్పగించామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాకేష్, మహేందర్, రవీందర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ(బోథ్): బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ఆత్రం సక్కు గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అరచేతిలో డిజిటల్ లైబ్రరీ

“ ఆండ్రాయిడ్ ఫోన్లు అందుబాటులోకి రావడం.. డిజిటలీకరణ పెరగడం.. ఎలక్ట్రానిక్ డివైజ్‌లు చౌకగా లభిస్తుండడంతో అన్నిరకాల సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటున్నాయి. ఫోన్‌లో మనకు కావాల్సిన సమాచారం క్షణాల్లో ప్రత్యక్షమవుతోంది. పలు రకాల సేవలు ఇంట్లో ఉండే పొందగలుగుతున్నాం. ఈ నేపథ్యంలో డిజిటల్ లైబ్రరీ కూడా అందుబాటులోకి వచ్చింది. దీంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు తమకు కావాల్సిన సమాచారం, స్టడీ మెటీరియల్ ఇంట్లో ఉండే పొందుతున్నారు. అరచేతిలో ఉన్న ఆండ్రాయిడ్ ఫోన్‌లో చూసుకుంటున్నారు.

– నిర్మల్‌ఖిల్లా



పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు (ఫైల్)



వెబ్‌సైట్ హోమ్‌పేజీ

- అందుబాటులోకి ‘నేషనల్ డిజిటల్ లైబ్రరీ’
- కేంద్ర మానవవనరుల శాఖ ఆధ్వర్యంలో అందుబాటులోకి..
- లక్షలాది డిజిటల్ పుస్తకాలు.. పోటీ పరీక్షలకు ఊతం
- వినియోగించుకుంటున్న ఉమ్మడి జిల్లా అభ్యర్థులు

సమాచార సేకరణ ఇలా..

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ అనుమతితో ఖరగ్‌పూర్ ఐఐటీ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్‌నెట్‌లో https:// ndl. iitkgp. ac. in/ అనే వెబ్‌సైట్‌లో ‘నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా’ పేరుతో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేసింది. ఇందులో విషయ నిపుణుల వీడియోలు కూడా ఉన్నాయి. పాఠశాల, కళాశాల, ఇంజనీరింగ్, వైద్య, న్యాయ విద్య, సాహిత్యం, సంస్కృతం.. ఇలా అన్నిరకాల స్టడీ మెటీరియల్‌ను ఇంగ్లిష్, హిందీతో పాటు ప్రాంతీయ భాషల్లో ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. పాఠశాల పుస్తకాలు (సీబీఎస్ఈ సిలబస్), ఇంజనీరింగ్ పుస్తకాలు, లిట్రేచర్, మెడిసిన్, లా మేనేజ్‌మెంట్, ఇతర గ్రంథాలు, వివిధ రకాల పుస్తకాలు వివిధ భాషల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పుస్తకాలన్నీ పీడీఎఫ్ ఫార్మాట్‌లో ఉండగా వెబ్‌సైట్ ఓపెన్ చేసి చదువుకోవచ్చు. లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కాగా స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్ కంప్యూటర్‌ల ద్వారా డిజిటల్ లైబ్రరీని వినియోగించుకునేలా తీర్చిదిద్దారు. ఇంటర్‌నెట్ గూగుల్‌లో ‘నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా’ అని టైప్ చేస్తే డిజిటల్ లైబ్రరీ తెరుచుకుంటుంది. ఈమెయిల్ ఐడీ ద్వారా లాగిన్ అయి రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. తర్వాత మనకు కావాల్సిన అంశాలను ఎంచుకుని చదువుకోవచ్చు. లేదా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉంటుంది.

దాదాపు 70 లక్షల పుస్తకాలు

ఆయా పోటీ పరీక్షలకు ఉపయోగపడే దాదాపు 70 లక్షల పుస్తకాలను ఈ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. ఎన్‌సీఈఆర్టీ రూపొందించిన వివిధ పాఠ్యాంశాలతో పాటు పలు ప్రముఖ యూనివర్సిటీలు రూపొందించిన పరిశోధన వ్యాసాలు, వివిధ రకాల ఉద్యోగ పరీక్షల సిలబస్ సబ్జెక్టు, విషయ పరిజ్ఞాన అంశాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 6 విభాగాలు ఉంటాయి. ఏ విభాగానికి సంబంధించిన పుస్తకం అవసరమో దానిపై క్లిక్ చేస్తే ఆయా పాఠ్యాంశాలకు సంబంధించిన డిజిటల్ పుస్తకాల పేజీలు ప్రత్యక్షమవుతాయి. వాటిని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని అవసరమైన సమయంలో చదువుకోవచ్చు.

డిజిటల్ తోడ్పాటు..

రానున్న మూడు నాలుగు నెలల కాలం మొత్తం ఉద్యోగ పోటీ పరీక్షల షెడ్యూల్‌తోనే నిండిపోయి ఉంది. టెట్ మొదలుకుని డీఎస్సీ, టీఎస్పీఎస్సీ గ్రూప్స్ పరీక్షలు మొదలుకానున్నాయి. వరుస ఉద్యోగ ప్రకటనల నేపథ్యంలో అవకాశాన్ని వినియోగించుకోవడానికి ఉమ్మడి జిల్లా అభ్యర్థులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. జిల్లా కేంద్రాల్లోని గ్రంథాలయాలకు నిరుద్యోగుల తాకిడి పెరిగిపోవడమే దీనికి తార్కాణం. ఇక స్టడీహాళ్లలో స్థలం దొరకడం కూడా గగనంగా మారింది. ప్రభుత్వ శాఖా గ్రంథాలయాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న లైబ్రరీలను కూడా నిరుద్యోగ అభ్యర్థులు వినియోగించుకుంటున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాలలో స్టడీ మెటీరియల్ సేకరణ కోసం డిజిటల్ గ్రంథాలయాలు కూడా తోడ్పడుతున్నాయి. ఏకకాలంలో పలు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు స్టడీ మెటీరియల్ పుస్తకాలు కొనడం ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. ఈ నేపథ్యంలో జాతీయస్థాయిలో కేంద్ర మానవవనరుల శాఖ ఆధ్వర్యంలో ‘నేషనల్ డిజిటల్ లైబ్రరీ’ పేరుతో ఇంటర్నెట్‌లో సమగ్ర సమాచారాన్ని అందిస్తోంది.

సమాచారం సమగ్రం..

డిజిటల్ వేదికను వినియోగించుకుంటే పోటీ పరీక్షల కోసం అవసరమయ్యే సంపూర్ణ సిలబస్ అందుబాటులో ఉంటుంది. ఇప్పటికే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, హెచ్‌డబ్ల్యూవో, డీఏవో, తదితర పోస్టుల పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. వీటితో పాటు జాతీయస్థాయిలో యూపీఎస్సీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, తదితర సంస్థలు వరుస ఉద్యోగ నోటిఫికేషన్ల ద్వారా ఎప్పటికప్పుడు నియామకాలు చేస్తున్నాయి. వీటికి సంబంధించిన పూర్తి సమాచారం సిలబస్ కూడా డిజిటల్ వేదికగా అందుబాటులో ఉంచారు.

అందుబాటులో ఉంచాం



నిరుద్యోగ యువతకు కావాల్సిన పుస్తకాలతో పాటు డిజిటల్ లైబ్రరీని కూడా అందుబాటులో ఉంచాం. అభ్యర్థులు ఉచిత ఇంటర్నెట్ ద్వారా తమకు కావాల్సిన స్టడీ మెటీరియల్ డౌన్‌లోడ్ చేసుకుని చదువుకోవచ్చు. జాతీయ స్థాయిలో అందుబాటులోకి తెచ్చిన నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ ప్రయోజనకరంగా ఉంటుంది.

– డాక్టర్ ఏ.చక్రధారి, కావేరి గ్రంథాలయ నిర్వాహకులు, నిర్మల్

ఆర్థికభారం తప్పింది



పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలను కొనుక్కోవడం ఆర్థిక భారంగా మారుతోంది. ఈ క్రమంలో జాతీయస్థాయిలో నేషనల్ డిజిటల్ లైబ్రరీ అందుబాటులోకి తేవడం నిరుద్యోగులకు ఊరట కలిగించింది. పోటీ పరీక్షలకు కావాల్సిన సిలబస్ స్టడీ మెటీరియల్‌ను డౌన్‌లోడ్ చేసుకుని చదువుకుంటున్నాం. ముఖ్యమైన అంశాలను నోటు పుస్తకాలలో రాసుకుంటున్నాం.

– గౌతమి, అభ్యర్థిని, ఖానాపూర్

అవకాశాన్ని వినియోగించుకుంటున్నాం



పలు రకాల పోటీ పరీక్షలకు సిలబస్ స్టడీ మెటీరియల్ సమకూర్చుకోవడం పెద్ద సమస్యగా పరిణమిస్తున్న సందర్భంలో డిజిటల్ లైబ్రరీ తోడ్పాటు ఆహ్వానించదగినది. అభ్యర్థులకు పరీక్షల సమయంలో కావాల్సిన సమాచారాన్ని సేకరించుకోవడానికి మంచి మార్గం. సమయం కూడా కలిసి వస్తుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నాం.

– పి.ఆకాశ్, అభ్యర్థి, అనంతపేట్, నిర్మల్

వేసవిలో సంరక్షణ చర్యలు అవసరం



కార్మికులతో మాట్లాడుతున్న స్వదేశ్

నిర్మల్‌ఖిల్లా: వేసవి ఎండలు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో తగిన సంరక్షణ చర్యలతో కూడిన జాగ్రత్తలు అవసరమని ప్రవాసీ మిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం సమీపంలోని కొండాపూర్, ఎల్లపెల్లి తదితర గ్రామాల పరిధిలో నివసిస్తున్న భవన నిర్మాణ, ఇటుకబట్టీ కార్మికుల ఆవాస ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడారు. ఉదయం పూటనే పనులు ముగించుకోవాలని, సాయంత్రం వేళల్లో మిగతా పనులు చేసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని, వడదెబ్బకు గురికాకుండా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. పని వేళల్లో మార్పులు చేసుకుంటూ కార్మికులకు సహకరించాలని సంబంధిత యాజమాన్యాలకు సూచించారు.

యువకుడు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, ఏఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం దేవాపూర్ గ్రామానికి చెందిన గుత్తె నానేశ్వర్, కౌసల్యాబాయి దంపతుల కుమారుడు రామేశ్వర్ (22)ఫిట్స్‌తో పాటు మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయం కాలేదు. మంగళవారం తెల్లవారు జామున చద్దర్‌తో దూలానికి ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. మృతదేహాన్ని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల నగదు పట్టివేత



భైంసారూరల్: నగదుతో ఎస్సై శ్రీకాంత్



నేరడిగొండ: సీజ్ చేసిన నగదుతో పోలీసులు

భైంసారూరల్(ముథోల్): మండలంలోని మిర్జాపూర్ వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో మూడు బొలెరో వాహనాల్లో రూ.4,71,000 నగదు పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. భైంసా నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న చొప్డే శివాజీ వద్ద రూ.3 లక్షలు, దర్శ దొండిబా వద్ద రూ.76 వేలు, ఉత్తమ్ బలిరాం వద్ద రూ.95 వేల నగదు పట్టుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

కుంటాల(ముథోల్): మండలంలోని అర్లి(కే) క్రాస్ రోడ్ 61వ జాతీయ రహదారిపై మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో నగదు పట్టుకున్నట్లు ఎస్సై వి. రజనీకాంత్ తెలిపారు. మహారాష్ట్రలోని బోకర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న కారులో రూ.77 వేల నగదును పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నా రు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

భైంసాలో 1.57 లక్షలు..

భైంసాటౌన్: పట్టణంలోని పార్డి (బి) బైపాస్ రోడ్డులోని బొర్ర గణేశ్ చౌరస్తా ప్రాంతంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.1.57 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. మంగళవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా చవాన్ రామారావు, సోమవంశీ యోగేష్, కదం కపిల్ భైంసా వైపు నుంచి నగదుతో వెళ్తుండగా పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రూ.2.25 లక్షలు స్వాధీనం

నేరడిగొండ(బోథ్): మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బజార్‌హత్నూర్ మండలంలోని దేగామ గ్రామానికి చెందిన నరేష్ బైక్‌పై రూ.2 లక్షల 25వేల నగదు తరలిస్తుండగా పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.







‘డబుల్’ కాలనీలో సమస్యలు తీర్చరూ..



జిల్లా కేంద్రంలోని నాగ్‌నాయిపేట్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి ఆరు నెలలు కావస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు ఇళ్లమధ్యనే నిలిచి ఉండడంతో దోమలకు ఆవాసంగా మారుతోంది. ఫలితంగా రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణం, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

చెక్‌పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

తలమడుగు(బోథ్): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేయబడిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మహారాష్ట్ర నుంచి వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి లక్ష్మీపూర్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోకి అక్రమంగా మద్యం, డబ్బు, గంజాయి, మాదక ద్రవ్యాలు, రవాణా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికలకు సంబంధించి బహుమతులు కూడా రవాణా కాకుండా చూడాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే రెవెన్యూ, ఎక్సైజ్, ఫారెస్టు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఆయన వెంట ఏఎస్సై సురేందర్, మధుసూదన్, దత్తు, కేశవరావు, ఎక్సైజ్ సిబ్బంది, వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ తనిఖీ

తాంసి(బోథ్): భీంపూర్ మండలంలోని కరంజి(టి) సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి సోమవారం రాత్రి తనిఖీ చేశారు. సిబ్బంది విధుల నిర్వహణ, వాహనాల తనిఖీలపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



రాజేందర్ (ఫైల్)

నేరడిగొండ(బోథ్): గత నెల 31న రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు తూము రాజేందర్ (19) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వాంకిడి గ్రామానికి చెందిన రాజేందర్ తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వ్యవసాయ క్షేత్రం వైపు వెళ్లి వస్తుండగా నారాయణపూర్ నుంచి ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్రంగా, ఇద్దరికి స్వల్ప గాయాలుకాగా ఆస్పత్రికి తరలించారు. రాజేందర్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంఅండ్‌హెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని పిట్టబొంగరం ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించడంతో పాటు ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు ప్రతాప్‌నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

సారంగపూర్: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఆడె వినోద్ తెలంగాణకు చెందిన మద్యం మహారాష్ట్రకు తరలిస్తుండగా సిర్పెల్లి చెక్‌పోస్టు వద్ద మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా 12 లీటర్ల మద్యం పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. మద్యం విలువ సుమారు రూ.13 వేల వరకు ఉంటుందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



బతుకు ప్రయాణం.. భానుడి ప్రతాపం

కాయ కష్టం చేసుకునే వలస కార్మికులు ఉపాధి కోసం నిత్యం పనులకు వెళ్తారు. ఎండ, నీడ అనే తేడా లేకుండా బతుకు బండి సాగేందుకు పనులు చేస్తారు. నిర్మల్ రూరల్ మండలంలోని ఇటుక బట్టీల్లో పని చేసేందుకు మహారాష్ట్రకు చెందిన కూలీలు వలస వచ్చారు. ఎండ తీవ్రత పెరగడంతో పని చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇంత ఎండలో పని చేయలేమంటూ మూట ముల్లె సర్దుకుని మండుటెండలో మంగళవారం ఇలా స్వస్థలాలకు పయనమయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

మొదటి వారంలో ఆసరా పెన్షన్లు ఇవ్వాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతీనెల మొదటి వారంలో దివ్యాంగులకు పింఛన్లు ఇవ్వాలని స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసాక్ అలీ కోరారు. నిర్మల్ పట్టణంలోని సంఘ భవనంలో మంగళవారం మాట్లాడారు. నిర్మల్, భైంసా మున్సిపాలిటీల్లో పెన్షన్‌లు సకాలంలో అందక దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య హామీ నెరవేర్చాలని కోరారు. శివకుమార్, నిషిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.